ఆంధ్రజ్యోతి
తిరుపతి
మంగళవారం 15 అక్టోబరు 2024

తుఫాన్ కంట్రోల్ రూములు

తిరుపతి కలెక్టరేట్ : 0877-2236007
గూడూరు సబ్ కలెక్టర్‌కార్యాలయం: 86242 52807
సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం: 86232 95345
తిరుపతి ఆర్డీవోకార్యాలయం: 86869 66559
శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం: 99665 24952





కోట మండలం శ్రీనివాససత్రం సముద్రతీరంలో ఎగిసిపడుతున్న అలలు

వాన ముప్పు
తీరంలో రెడ్ అలర్ట్

భారీ వర్షాల హెచ్చరికలతో యంత్రాంగం అప్రమత్తం

తిరుపతి/తిరుపతి (కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా సోమవారం ఓ మోస్తరుగా వర్షం పడింది. మంగళవారం నుంచి భారీగా పడొచ్చని వాతావరణ హెచ్చరించింది. ఈ క్రమంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సముద్ర తీర ప్రాంతాలైన కోట, వాకాడు, చిల్లకూరు మండలాలపై ప్రత్యేక దృష్టి సారించింది. తీర ప్రాంత గ్రామాల్లో అధికారులు సోమవారం పర్యటించారు. పరిస్థితిని పరిశీలించి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళకుండా సూచనలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. తుఫాను షెల్టర్లను, ఇతర పునరావాస కేంద్రాలను పరిశీలించి.. సిద్ధం చేస్తున్నారు. రిజర్వాయర్లు, చెరువులు, కాలువలు, కాజ్‌వేలను పరిశీలించారు. రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వ స్థాయిలను గుర్తించారు. అన్ని జలవనరుల వద్దా కాపలా ఏర్పాటు చేశారు. ప్రమాదకర పరిస్థితులున్న చోట్ల, కాజ్‌వేల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచుతున్నారు. 2021నాటి వరదల అనుభవంతో ముందు జాగ్రత్త చర్యలన్నీ తీసుకుంటున్నారు. పోలీసు, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, విద్యుత్, వైద్యారోగ్య శాఖ, పౌరసరఫరాలు వంటి కీలక శాఖలను కలెక్టర్ అప్రమత్తం చేశారు. ఇప్పటికే ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గూడూరు చేరుకున్నాయి. వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. మంగళవారం ఉదయం వాన పరిస్థితిని బట్టి సెలవుపై నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు చెప్పారు.

తడలో 77.2 మి.మీ. వర్షం

జిల్లాలో సోమవారం అత్యధికంగా తడలో 77.2మి.మీ. నమోదైంది. మండలాల వారీగా.. సూళ్లూరుపేట 54.2, వరదయ్యపాళెం 53.4, ఏర్పేడు 45, బుచ్చినాయుడుకండ్రిగ 41.2, దొరవారి సత్రం 40.6, చిట్టమూరు 38.4, శ్రీకాళహస్తి 36.2, చిల్లకూరు 34.6, వాకాడు 33.8, గూడూరు 32.4, వెంకటగిరి 31.4, తిరుపతి రూరల్ 30.8, రామచంద్రాపురం 30, తొట్టంబేడు 29.5, ఓజిలి 27.2, నాయుడుపేట 26.2, పెళ్లకూరు 25.2, కేవీబీపురం 24.8, రేణిగుంట 24.2మి.మీ చొప్పున వర్షం పడింది.

జిల్లా అధికారులకు సీఎం దిశానిర్దేశం

భారీ వర్ష సూచన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. సోమవారం ఆయన టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. మానవ, పశు ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా చూడాలన్నారు. ఎప్పటికపుడు తుఫాను సమాచారాన్ని మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేయాలన్నారు. మంగళవారం నుంచి వర్షప్రభావం ఎక్కువగా ఉంటుందని, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు.

అప్రమత్తమైన టీటీడీ

ఇంకోవైపు టీటీడీ యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. ఘాట్ రోడ్లు దెబ్బ తినకుండా, రాళ్ళు, బండలు విరిగిపడి వాహనాలు ప్రమాదానికిలోను కాకుండా ముందు జాగ్రత్తలన్నీ తీసుకుంటోంది. మంగళవారం వీఐపీల సిఫారసు లేఖలు కూడా తీసుకోరాదని, 16న వీఐపీ దర్శనాలు కూడా రద్దు చేయాలని నిర్ణయించింది.

సముద్రంలో అలల ఉధృతి



● చేపల వేట ఆపేయడంతో ఒడ్డుకు చేరిన పడవలు

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగండం ప్రభావంతో ఇప్పుడిప్పుడే సముద్రంలో అలల ఉధృతి పెరుగుతోంది. మూడు రోజులపాటు భారీ వర్ష సూచన.. అధికారుల హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సోమవారం చేపల వేట నిలిపేశారు. దీంతో సముద్రంలో నుంచి పడవలు, వలలు, ఒడ్డుకు చేరాయి. సముద్రతీర ప్రాంత గ్రామాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించారు. ఇక, సోమవారం తెల్లవారుజాము నుంచే గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, కొత్తపట్నం, సముద్రపు వెంబడి గ్రామాల్లో ఈదురుగాలులు, ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం ఎక్కడ అల్పపీడనంగా మారి తీవ్ర తుఫాను వల్ల నష్టపోతామోనని కోట, చిట్టమూరు, వాకాడు మండలాల ప్రజలు ఆదోళన చెందుతున్నారు.

పులికాట్‌కు జలకళ



సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిన్న, మొన్నటి వరకు నీరులేక ఎడారిని తలిపించిన పులికాట్ సరస్సు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షంతో జలకళ సంతరించుకొంది. వర్షంతో పాటు మధ్నాహ్నం నుంచి తేలికపాటి ఈదురు గాలులు తోడవ్వడంతో సరస్సులోకి ఎగువ ప్రాంతం నుంచి కూడా నీరుచేరింది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో కుదిరి, అట్టకానితిప్ప వద్ద సరస్సులో అలల ఉధృతి సముద్రాన్ని తలపిస్తోంది. పులికాట్ జలకళ రావడంతో పాటు తీరం వెంబడి చల్లని గాలులతో కూడిన వాతావరణం ఉండడంతో జాలర్లు చేపల వేట సాగిస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో స్థానికులకు టైంస్లాట్

శ్రీకాళహస్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానిక భక్తులకు దర్శనానికి సంబంధించి ప్రత్యేక టైంస్లాట్ కేటాయిస్తూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6 నుంచి 7.30గంటల వరకు సాయంత్రం 7నుంచి 8.30గంటల వరకు స్థానికులు ముక్కంటి ఆలయంలో కంచుగడప నుంచి ఎలాంటి టిక్కెట్టు లేకుండా ప్రవేశించే విధంగా టైంస్లాట్ అమలు చేయనున్నట్టు ఈవో పేర్కొన్నారు. నాల్గో గేట్‌లోని పీఆర్వో కార్యాలయం వద్ద ఆధార్ కార్డుతో నమోదు చేసుకున్న స్థానిక భక్తులను కంచుగడప వద్ద అనుమతించనున్నారు. ప్రస్తుతం నాల్గో గేట్‌లో పీఆర్వో కార్యాలయం ఉంది. అయితే స్థానిక భక్తుల కోసం 1వ గేటు వద్ద మూడు రోజుల్లో అదనపు పీఆర్వో కార్యాలయం ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు.

ఆధార్‌తో దర్శనాలా..?

స్థానిక భక్తులకు ఆధార్‌కార్డుతో శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనం చేసుకునేలా నిర్ణయం సరికాదని ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు చిట్టివేలు జయగోపాల్ అన్నారు. స్థానిక భక్తులు ఉదయం నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు వస్తుంటారన్నారు. మహిళలు, వృద్ధులు తమ ఆధార్‌కార్డును దక్షిణ గోపురం వద్ద ఉన్న పీఆర్వో కార్యాలయంలో చూపించి స్లిప్పు తీసుకుని మళ్లీ స్వామిఅమ్మవార్ల దర్శనానికి కంచు గడప వద్ద సాధారణ క్యూలైన్‌లో పంపంచే నిర్ణయం సరికాదన్నారు. దీని వలన ఆలయానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి ఈ నిర్ణయం పునఃసమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు.

కిక్కు వీరికే..!

● 3920 దరఖాస్తులకు 5 గంటల్లో ముగిసిన ప్రక్రియ

● లాటరీ తీసి 227 మద్యం దుకాణాల కేటాయింపు

16 మంది మహిళలకు షాపులు





షాపులు దక్కిన వేళ..



డిప్ తీసి నెంబరు చూపుతున్న కలెక్టరు వెంకటేశ్వర్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న 3920 మందిలో లక్కు ఎవరికన్నది తేలిపోయింది. లాటరీ ద్వారా సోమవారం 227 మద్యం దుకాణాలను కేటాయించారు. తిరుపతిలోని శిల్పారామంలో కలెక్టర్ వెంకటేశ్వర్ సమక్షంలో లైసెన్సుల జారీకి లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. లాటరీ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాలి. అయితే, సీఎం టెలికాన్ఫరెన్సులో కలెక్టర్ బిజీగా ఉండటంతో 8.55 గంటలకు వచ్చాక ప్రారంభించారు. ఆ తర్వాత 3920 దరఖాస్తుల్లో జిల్లా గెజిట్‌లో ప్రచురించిన దుకాణాల క్రమ సంఖ్య ప్రకారం లాటరీ తీసి దుకాణాలు దక్కించుకున్న వారి పేర్లను ప్రకటించారు. తొలుత తిరుపతి అర్బన్‌లో 32 దుకాణాలకు సంబంధించిన దరఖాస్తుదారులను హాలులోకి రప్పించారు. ఏ దుకాణానికి ఎంతమంది దరఖాస్తు చేశారనే వివరాలను డిజిటల్ బోర్డులో డిస్‌ప్లే చేశారు. అనంతరం డిప్ తీశారు. ఇలా తిరుపతి డివిజన్‌లోని ఆరు మండలాలకు సంబంధించి మధ్యాహ్నం 12 గంటలకు.. 12 గంటల నుంచి గూడూరు డివిజన్‌లోని ఐదు మండలాలకు.. చివరగా మధ్యాహ్నం రెండు గంటలకు వెంకటగిరి మండలానికి సంబంధించి డిప్ తీసి లైసెన్సుదారులను ప్రకటించడంతో ఈ ప్రక్రియ ముగిసింది. ఇలా 227 మందికి దుకాణాల లైసెన్సులు కేటాయించారు. దాదాపు 4200 మంది హాజరయ్యారు. జేసీ శుభం బన్సాల్, ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మద్యం షాపులు

227 దుకాణాలకుగాను 75 మంది మహిళలు దరఖాస్తు చేశారు. వీరిలో 16 మందికి లాటరీ ద్వారా మద్యం దుకాణాలు దక్కాయని ఎక్సైజ్ అధికారులు చెప్పారు.

ప్రతి దుకాణానికి ముగ్గురి ఎంపిక

లాటరీ ద్వారా దుకాణం దక్కించుకున్న అతడితో పాటు రిజర్వులో మరో ఇద్దరి పేర్లు కూడా ఎంపిక చేసి ప్రకటించారు. ఒక వేళ మొదటి లైసెన్సుదారుడు సకాలంలో ఫీజు చెల్లించకుంటే రిజర్వులో ఉన్న వారికి అవకాశం ఇస్తారు. ఈ లైసెన్సు ఫీజును ఆరు కంతుల్లో చెల్లించాలి. దీని కోసం లాటరీ తీసే హాలు వద్ద బ్యాంకర్లు కౌంటర్లు ఏర్పాటు చేశారు. తొలి రోజు మొదటి కంతు నగదు చెల్లించి లైసెన్సు పొందాలి. కాగా, 163 మద్యం షాపులు రూ.65 లక్షల శ్లాబులోను.. మరో 64 మద్యం దుకాణదారులు రూ.55 లక్షల శ్లాబులో ఉన్నారు. వీరంతా తొలికంతు నగదు కట్టి లైసెన్సు పొందారు. ఇప్పటికే, దరఖాస్తు ఫీజు కింద రూ.రెండు లక్షల చొప్పున 3920 మంది రూ.78.40 కోట్లు చెల్లించారు.

ఆగండి.. అన్నతో మాట్లాడి చెబుతా

తిరుపతి రూరల్ పరిధిలోని 12 దుకాణాలకుగాను తిరుచానూరు వారికి ఏడు దక్కాయి. వీరు లైసెన్సు ఫీజు చెల్లించడానికి కౌంటర్ వద్దకు వెళ్లగా.. 'కాసేపు ఆగండి. అన్నతో (ఒక ప్రజాప్రతినిధి) మాట్లాడి చెబుతా'నంటూ అక్కడ డ్యూటీలో ఉన్న ఓ ఎక్సైజ్ సీఐ హుకుం జారీ చేశారు. అక్కడే ఉన్న మరో ఎక్సైజ్ సీఐ వారికి సర్ది చెప్పడంతో ఎలాంటి వివాదానికి దారి తీయలేదు. ఈ విషయం ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అలాంటిది జరగడానికి అవకాశం లేదన్నారు. దీనిపై పరిశీలిస్తానన్నారు.



మద్యం షాపులు దక్కించుకున్నాక అక్కడే కౌంటర్లలో డబ్బు కడుతున్న దృశ్యం

పారదర్శకంగా లాటరీ విధానం

డిప్ ద్వారా 227 మద్యం దుకాణాలను పారదర్శకంగా కేటాయించామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. లక్కీ డిప్ ముగిశాక ఆయన మీడియాతో మాట్లాడారు. లైసెన్సుదారులు బుధవారం నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారన్నారు. మంగళవారం నుంచి స్టాకు తీసుకెళ్లాలని సూచించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ సహకారంతో పారదర్శకంగా మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ పూర్తి చేశామని ఎక్సైజ్ సూపరిటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి చెప్పారు. ఈ మీడియా సమావేశంలో ఏసీ శ్రీనివాసాచ్చారి, ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి, ఏఈఎస్‌లు వాసుదేవ చౌదరి, ఊహశ్రీ, ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, ఎన్‌ఫోర్సుమెంటు ఎస్ఐ స్వామినాథన్, సిబ్బంది పాల్గొన్నారు.



గూడూరు మండలం కొండాగుంటలో సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

రూ.154 కోట్లతో పల్లె పండుగ

● తొలిరోజు 54 పనులకు శంకుస్థాపన

తిరుపతి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం 'పల్లె పండుగ' మొదలైంది. వర్షం కారణంగా చంద్రగిరి, సూళ్లూరుపేటలో తొలిరోజు కార్యక్రమాలు చేపట్టలేదు. శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో 54 అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు జరిగాయి. గ్రామాల్లో అభివృద్ధి పనులకు జోరుగా శంకుస్థాపనలు చేపట్టాల్సి వుండగా వానలు, ఈదురు గాలుల ప్రభావంతో చాలాచోట్ల కార్యక్రమాలు జరగలేదు. గత ఆగస్టు 23న జిల్లావ్యాప్తంగా 774 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులపై తీర్మానాలు చేసిన విషయం తెలిసిందే. ఆ క్రమంలో జిల్లాకు ప్రభుత్వం రూ. 154.40 కోట్లు కేటాయించింది. ఇప్పుడు 'పల్లె పండుగ' పేరుతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. డిప్ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియలో పాల్గొన్న కారణంగా కలెక్టర్ వెంకటేశ్వర్ పల్లె పండుగలో పాల్గొనలేకపోయారు. ఈనెల 20వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరగాల్సి ఉంది. కాగా, 17 వరకు భారీ వర్ష హెచ్చరికల నేపథ్యంలో మూడు రోజుల పాటు పల్లె పండుగ కార్యక్రమం చురుగ్గా కొనసాగే పరిస్థితి కనిపించడం లేదు.

కల్యాణ వేంకన్న పవిత్రోత్సవాలు



చంద్రగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 28 నుంచి 30 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయంలో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ జరిగే దోషాల నివారణకు ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పవిత్రోత్సవాలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 27 అంకురార్పణ జరగనుంది. 28న పవిత్ర ప్రతిష్ఠ, 29 పవిత్ర సమర్పణ, 30 పూర్ణాహుతి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈమూడు రోజుల పాటు ఉదయం స్నపనతిరుమంజనం, సాయంత్రం వీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో ఈనెల 28 వరకు ఆర్జిత సేవలు రద్దయ్యాయి.

ఆర్‌సీపురంలో భారీ వర్షం



రామచంద్రాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మండలంలో భారీ వర్షం కురిసింది. ఈమధ్య కాలంలో ఇదే భారీ వర్షం. చిన్నపాటి కాలువలతో పాటు పొలాల్లో కూడా నీరు నిలిచింది. ఈ వర్షం కారణంగా చెరకు తోటలకు మేలు కలుగుతుందని రైతులు అంటున్నారు. భారీ వర్షాలు హెచ్చరికల నేపథ్యంలో అధికారులు సోమవారం అందుబాటులో ఉన్నారు. రాత్రి 10 గంటల తర్వాత వాన కొంచెం తగ్గుముఖం పట్టింది

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

తిరుచానూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నానిని సోమవారం చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు. జిల్లా మైన్స్ ఏడీ బాలాజీనాయక్ కూడా ఎమ్మెల్యేను కలిశారు.

ఉద్యాన రైతులకు సూచనలు



పసుపుతోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

రామచంద్రాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం పంచాయతీలో ఉద్యాన పంటలైన పసుపు, కంద, సంపెంగ తోటలను ఆశాఖ అధికారి సుధీర్ సోమవారం పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు పలు సూచనలు ఇచ్చారు. తోటల్లో నీరు నిల్వ లేకుండా మురుగుకాలువల ద్వారా తరలించాలనానరు. తోటల్లో నీరు త్వరగా ఇంకి పోవడానికి దుక్కి దున్నాలన్నారు. చనిపోయిన మొక్కలను తీసి కొత్తవి నాటాలన్నారు. ఆధిక వర్షాలు వలన తెగుళ్ల సోకకుండా మందులు పిచికారీ చేయాలన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు





మాగుంట శ్రీనివాసులరెడ్డి- గుమ్మనూరు జయరాం

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

చంద్రగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ఈనెమ 17 వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో రామ్మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్నిశాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిందన్నారు. మండంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్, ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శేఖర్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూమి ఆన్‌లైన్‌లో మార్చేశారంటూ ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బాధితులు

చంద్రగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తన అనువంశిక పట్టా భూమిని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో మార్చేసుకున్నాడని ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంలేదని బాధితులు సోమవారం గ్రీవెన్స్ డేలో తహసీల్దార్ శివరామసుబ్బయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా బాధితుడు సుబ్రమణ్యం మాట్లాడుతూ ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలో నాగపట్ల లెక్కదాఖల్లో సర్వే నెంబర్ 61-1లో ఎకరం స్థలం తమకు అనువంశికంగా వచ్చిందన్నారు. ఈ భూమి చుట్టూ దళితుల భూములు ఉన్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తమ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మొక్కల వెంకటరెడ్డి గతేడాది భూమిని తన పేరిట మార్చుకుని, దౌర్జన్యంగా ఆక్రమించుకొన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడన్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఇకనైనా తమకు న్యాయం చేయాలని కోరారు.



మ్యాన్‌హోల్ వద్ద మరమ్మతులు

వర్షపు నీరు తొలగింపునకు సత్వర చర్యలు

తిరుపతిరూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్‌మండలం మల్లంగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని వినాయకనగర్‌లో వర్షాలకు నీరు ఇళ్లలోకి చేరింది. రోడ్డు ఒకవైపు ఎత్తుగా నిర్మించడంతో కిందభాగంలో వర్షనీరు రోడ్డుపై నిలిచిపోయింది. మ్యాన్‌హోల్‌కి మరమ్మతులు చేపట్టి నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే నానీ ఆదేశాల మేరకు గ్రామటీడీపీ నేతలు పార్లపల్లె మునికృష్ణారెడ్డి, దిలీప్‌కుమార్‌యాదవ్‌లు స్పందించి సమస్యకు సత్వర పరిష్కారం చేపట్టారు. కార్యదర్శి బాలసుబ్రమణ్యంరెడ్డి, వీఆర్వో యోగానందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఆక్రమణల పర్వం

- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారవర్గాలు
- ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా పాగా







కాలువ స్థలాన్ని చదును చేసి నిర్మాణం - బండరాళ్లను తొలగించి కాలువ స్థలంలో చదును ప్రక్రియ- డీకేటీ భూమిలో నిరాణం

తిరుపతిరూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురంగ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో కొందరు ఆక్రమణదారులు బరితెగిస్తున్నారు. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. తిరుపతికి అతి సమీపంలో ఉన్న ఈ భూములు నివాసానికి అనువుగా ఉండడం తోపాటు ఖరీదైనవి కూడా. దీంతో గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. కాలువ పోరంబోకు స్థలాల్ని కూడా వీరు వదలడంలేదు. అందులో రేకులషెడ్లు, పక్కా ఇళ్ల వంటి నిర్మాణాలు చేపడుతున్నారు. డీకేటీ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించేస్తున్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన స్థానిక రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఫలితంగా ఆక్రమణదారులకు అడ్డూఆపూలేకుండా పోతోంది. గత వైసీపీ పాలన తరహాలోనే కూటమి ప్రభుత్వంలోనూ ఆక్రమణల పర్వం కొనసాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్‌సీపురానికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం నుంచి గ్రామానికి వచ్చే కాలువభూమి దాదాపుగా కనుమరుగైంది. అలాగే పంచాయతీలో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణదారుల చేతులోకి వెళ్లాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెలుగుచూసిన కొన్ని ఆక్రమణలివి.

- గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలోని సర్వేనెంబరు 208లోని కాలువపోరంబోకు స్థలంలో ఇప్పటికే పలు అక్రమ నిర్మాణాలను చేపట్టారు. మిగిలిన స్థలంలో కొత్తగా నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నారు.
- రామదాసుకాలనీలో సర్వేనెంబరు 226లో కాలువ స్థలంలోని పెద్దబండరాళ్లను తొలగించి చదును చేశారు. ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు గుట్టుచప్పుడు కాకుండా బండరాళ్లను ఎక్సవేటర్‌తో తొలగించారని స్థానికులు చెబుతున్నారు.
- కేశవానంద ఆశ్రమానికి వెనుకవైపు బాయమ్మతోట సమీపంలో సర్వేనెంబరు 392/2లోని డీకేటీభూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈస్థలంలో అంకణం రూ.25వేలకు పైగా ధర నిర్ణయించి మరీ విక్రయించడం విశేషం.

అరుణా నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నాగలాపురం, అక్టోబ రు 14(ఆంధ్రజ్యోతి): అరుణానదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది మం డలంలోని కారణిలో అనారోగ్యంతో మృతి చెందిన క్రిష్ణయ్య (72) అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా అరుణా నదిలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. అదే రోజు రాత్రి వరకు నాగలాపురం పోలీసులు, సత్యవేడు అగ్నిమాపక దళం సిబ్బంది వడివేలు(38) ఆచూకీ కోసం గాలించారు. చీకటి పడడంతో వెను దిరిగారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నాగలాపురం ఎస్‌ఐ సునీల్‌కుమార్ సిబ్బందితో స్థానిక జాలర్ల సాయంతో అరుణానదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహానికి సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు.

కారణి గ్రామం సమీపంలోని అరుణానదిలో గత వైసీపీ ప్రభుత్వం భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు జరపడంతో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. కారణివాసులకు అంత్యక్రియలు నిర్వహించాలంటే అరుణానదిని దాటాల్సిందే. ఈ నేపథ్యంలో అతి పెద్ద గుంతలో పడి వడివేలు గల్లంతయ్యాడు. ఈత తెలిసినా కూడా గుంతలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడని కుటుంబీకులు భోరున విలపించారు.

మూడు ప్రభుత్వ కార్యాలయాలకు తాళం

జగమర్లలో మూతేసి యువత నిరసన - దారి సమస్య తలెత్తడమే కారణం



జగమర్లలో మూతపడిన ప్రభుత్వ కార్యాలయం

పలమనేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలోని మూరుమూల అటవీగ్రామం జగమర్లలోని మూడు ప్రభుత్వ కార్యాలయాలకు దారి సమస్య తలెత్తింది. దీంతో ఆ గ్రామానికి చెందిన యువత ఆ కార్యాలయాలకు రెండ్రోజుల కిందట తాళం వేసింది. వివరాలిలా.. ఈ గ్రామంలో ఏపార్టీ అధికారంలో ఉంటే వారి హవా కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. మూరుమూల అటవీ గ్రామంగా వైసీపీ ప్రభుత్వం గుర్తించి రైతు భరోసాకేంద్రం, హెల్త్ సెంటర్, సచివాలయ భవనాల నిర్మాణాలకు రూ.60లక్షలు మంజూరు చేసింది. అయితే గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఆ గ్రామ దివంగత మాజీ సర్పంచ్ సాంబశివారెడ్డి కుటుంబీకులు ముందుకొచ్చారు. ఈ భవనాల నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని తాము కొనుగోలు చేసి ఇస్తామన్నారు. స్థల దాతలుగా తమ కుటుంబాన్ని శిలాఫలకంలో పేర్కొనాలని షరతు పెట్టారు. అందుకు అప్పట్లో అధికారులు సమ్మతించారు. నారాయణ రెడ్డికి చెందిన భూమిలో రూ.10లక్షలు వెచ్చించి దివంగత సాంబశివారెడ్డి కుటుంబ సభ్యులు భవనాల నిర్మాణానికి స్థలం కొనుగోలు చేసి ఇచ్చారు. అధికారులు కూడా వెంటనే మూడు భవనాలు నిర్మించారు. ఈ భవనాల వద్దకు వెళ్లడానికి ఇప్పటివరకు కూడా నారాయణరెడ్డి తన భూమిలోనే దారి అనధికారికంగా ఇచ్చారు. ఏం జరిగిందో తెలియదు గ్రామానికి చెందినవారికి, నారాయణరెడ్డికి మధ్య వాగ్వాదాలు జరిగాయి. ఈక్రమంలో ఇప్పటి వరకు వాడుతున్న దారిని నారాయణరెడ్డి మూసేశారు. ప్రభుత్వ భవనాలకు మరోవైపు గ్రామనత్తానికి చెందిన స్థలం ఉందని, అక్కడి నుంచి దారి ఉందని నారాయణరెడ్డి చెప్పారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు రెండ్రోజుల కిందట ప్రభుత్వ కార్యాలయాలకు తాళం వేసి నిరసన తెలిపారు.

గ్రామస్తులతో చర్చించిన ఎంపీడీవో

ఎంపీడీవో ఖాదర్‌బాషా గ్రామస్తులతో చర్చించారు. ఇప్పటివరకు వెళ్తున్న దారే సౌకర్యంగా ఉందని, దాన్నే కొనసాగించాలని గ్రామస్తులు కొందరు ఎంపీడీవోకు చెప్పారు. అయితే నారాయణ రెడ్డి కుటుంబీకులు మాత్రం భవనాలకు తమ పట్టా భూమిని ఇచ్చామని, దారి ఇవ్వాలన్న నిబంధన ఏమీ లేదన్నారు. మరో దారి కూడా ఉండటంతో వినియోగించుకోవాలని సూచించారు. దీనిపై ఎంపీడీవోను విచారించగా, తాను ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. వారి సూచన మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

తీరప్రాంత గ్రామాల పరిశీలన

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో అధికారులు సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని స్వర్ణముఖి నది పరివాహక గ్రామాలైన రుద్రవరం, ఉనుగుంటపాళెం, తిన్నెల పూడి, గూడలి గ్రామాల్లో తహసీల్దారుతో పాటు ఎంపీడీవో వేణు, వివిధ శాఖల అధికారులు పర్యటించారు. లోతట్టు గ్రామాలైన కర్లపూడి, రుద్రవరం, గోవిందపల్లి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. రేషన్ దుకాణాల వద్ద నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచారు.

ముంపు ప్రాంతాల్లో....

దొరవారిసత్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంపు ప్రాంతాల్లో అధికారుల బృందం పర్యటించింది. తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్‌ఐ అజయ్‌కుమార్, ఇతర శాఖల అధికారులతో కలసి పులికాట్ తీర గ్రామాలైన మీజూరు ప్రాంతంతో పాటు, కాళంగి పరివాహక ప్రాంతాలైన వేటగిరిపాళెం, బురదమడుగు, తల్లంపాడు, వైఎస్‌ఆర్ నగర్, తనియాలి గిరిజన కాలనీల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుకు భవనాలను పరిశీలించారు. మూడు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వెంకటగిరిలో మోస్తరు వర్షం

వెంకటగిరి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వెంకటగిరిలో సోమవారం మోస్తరు వర్షం పడింది. తెల్లవారు జామున 4గంటల నుంచి వర్షం కురిసింది.

పంటలను ధ్వంసం చేస్తున్న గజరాజులు

వరికి అపార నష్టం - మొక్కుబడి నష్టపరిహారం చెల్లిస్తున్నారంటున్న రైతులు



ఏనుగులు తొక్కేసిన వరి



విరిచేసిన రాతి కూసాలు

కల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన పంటలపై ఏనుగులు వరుస దాడులు చేస్తూ రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. పలమనేరు కౌండిన్య అడవి నుంచి రెండేళ్ల కిందట పులిచెర్ల మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు విడతల వారీగా పంటలపై పడుతోంది. ప్రధానంగా వరి పంటకు అపారనష్టం వాటిల్లింది. రెండు నెలల కిందట మరోమారు మండలంలోకి ప్రవేశించిన 16 ఏనుగుల గుంపు పగటిపూట అడవిలో ఉంటూ రాత్రి వేళ రెండు, మూడు బృందాలుగా విడిపోయి పంటలపై పడుతున్నాయి. ఆదివారం రాత్రి మండలంలోని అయ్యావాండ్లపల్లె, దేవళంపేట, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, పాళెం పంచాయతీల్లోని పలువురు రైతుల వరి పంటలను ధ్వంసం చేశాయి. అయ్యావాండ్లపల్లెలోని ధనంజయకు చెందిన ఎకరా వరి, చిన్నరెడ్డెప్పకు చెందిన ఎకరా వరి, కౌలు రైతు యల్లప్పకు చెందిన అర ఎకరా వరి, ఎర్రంవాండ్లపల్లెలోని నారాయణకు చెందిన అర ఎకరా వరి, మంగళపల్లెలోని రైతు కృష్ణయ్యకు చెందిన ఎకరా వరిని ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. దేవళంపేట పంచాయతీ మునిరెడ్డిగారిపల్లెలోని మునస్వామిరెడ్డికి చెందిన మామిడి తోట కంచెకు అమర్చిన 10 రాతి కూసాలను విరిచేశాయి. దిన్నెబెస్తపల్లెలోని వెంకటస్వామికి చెందిన అర ఎకరా వరి, కొక్కువారిపల్లెలోని గౌరీప్రసాద్‌నాయుడికి చెందిన ఎకరా వరి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె పంచాయతీ గేటుకాడబెస్తపల్లెలోని మునిచంద్రకు చెందిన అర ఎకరా వరి, పాళెం పంచాయతీ కొంగరవారిపలల్లెలోని సురేంద్రనాయుడికి చెందిన అర ఎకరా వరి, రామనాథం నాయుడికి చెందిన ఎకరా పశుగ్రాసాన్ని తొక్కి నాశనం చేశాయి. గురువారం ఉదయం సుమారు 15 ఏనుగుల గుంపు గుట్టమీద పల్లె, పాళెం మీదుగా తూర్పు విభాగం అడవిలోకి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. తూర్పు అటవీ విభాగం ప్రాంతంలో ధ్వంసమైన పంటలను ఎఫ్ఆర్వో థామస్‌కుమార్, మంగళంపేట సెక్షన్ ఎఫ్ఎస్వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో మున్నా పరిశీలిస్తున్నారు. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలో మాత్రం ఐరాల సెక్షన్ ఎఫ్‌బీఓవో శ్రీదేవి మినహా మిగిలిన అధికారులెవరూ పరిశీలించిన దాఖలాలు లేవు. మరోవైపు పంటలకు నష్ట పరిహారం మొక్కుబడిగా చెల్లిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీపీవోలో నేడు పీజీఆర్ఎస్

చిత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం(డీపీవో)లో మంగళవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో బాధితులు నేరుగా వచ్చి సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో నేటి పీజీఆర్ఎస్ రద్దు

చిత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో మంగళవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని భారీ వర్షాల కారణంగా రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసలు కోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

యూజీ, పీజీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

గుడుపల్లె, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో 2024 -25 విద్యాసంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి 14 నుంచి 25 వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల తెలిపారు. ద్రావిడ విశ్వవిద్యాలయాల భాగస్వామ్య రాష్ట్రాల కోటాకు సంబంధించి మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కోసం దరకాస్తులు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు ద్రావిడ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ (డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ. ద్రావిడియన్ యూనివర్సిటీ.ఏసీ.ఇన్)ను సందర్శించాలని కోరారు.

కారు బోల్తా.. యువకుడి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



శాంతిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో సోమవారం తెల్లవారుజామున కడపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు .. శాంతిపురం మండలం రాళ్లబూదుగూరుకు చెందిన జమీర్‌అహ్మద్, మహమ్మద్ సిద్దిక్‌లు తమిళనాడుకు చెందిన లోకేష్, వర్తనంపల్లెకు చెందిన తరుణ్ కారులో కుప్పం వైపు వెళుతుండగా కారు అదుపుతప్పి కడపల్లె వద్ద రోడ్డు పక్కన ఉన్న దిమ్మెకు ఢీకొని పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో జమీర్ అహమ్మద్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు 108లో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో మహమ్మద్ సిద్ధిక్ పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించారు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



రాజేంద్ర (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం రైల్వేగేట్ సమీపంలో సోమవారం ఉదయం మండలంలోని కట్టువపల్లి గ్రామానికి చెందిన ఈదూరు రాజేంద్ర(33) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఉదయం 7 గంటల సమయంలో రైల్వేగేటు వంతెనకు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు కింద రాజేంద్ర పడుకోవడంతో తల, మొండెం రెండుగా తెగిపోయాయి. మృతదేహం వద్ద ఉన్న సెల్‌ఫోన్, ఆధార్ కార్డుల ఆధారంగా కట్టువపల్లి గ్రామానికి చెందిన రాజేంద్రగా రైల్వే సిబ్బంది గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సూళ్లూరుపేట రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీ లించారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడుకి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. రాజేంద్రకు కొంత కాలంగా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అత్త, మామలపై అల్లుడి దాడి

గూడూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయమై వివాదం చెలరేగడంతో అత్త, మామలపై అల్లుడు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ కథనం మేరకు... స్థానిక ఇందిరానగర్‌కు చెందిన కృష్ణారావు, ధనలక్ష్మి దంపతులు చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె మహాలక్ష్మిని విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యానికి ఇచ్చి వివాహం చేశారు. సుబ్రహ్మణ్యానికి, అత్తా, మామలైన ధనలక్ష్మి, కృష్ణారావుకు ఆస్తి విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సుబ్రహ్మణ్యం విజయవాడ నుంచి మరో నలుగురితో కలిసి గూడూరుకు వచ్చారు. ఆస్తి విష యమై మాటామాటా పెరిగి వివాదంగా మారడంతో ధనలక్ష్మి, కృష్ణారావుపై సుబ్రహ్మణ్యం రాడ్డుతో దాడి చేశాడు. కృష్ణారావు, ధనలక్ష్మి తలకు తీవ్ర గాయాలవడంతో వారిని ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులందరికీ హాస్టల్ సీట్లు ఇవ్వాలి

తిరుపతి(విద్య), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నడిచే విద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులందరికీ హాస్టల్ సీట్లు కేటాయించాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హేమాద్రి యాదవ్ కోరారు. ఈ మేరకు జేఏసీ నాయకులు సోమవారం డీఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. హేమాద్రి మాట్లాడుతూ పేద విద్యార్థులకు కళాశాల సీటు వచ్చినా వసతిగృహంలో రాకపోవడంతో ప్రైవేట్ హాస్టళ్లను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. టీటీడీ విద్యాసంస్థల్లో 60 శాతం విద్యార్థులకు హాస్టల్ సీట్లు కేటాయించాలని, 40 శాతం మాత్రమే డేస్కాలర్స్‌గా భర్తీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. స్పాట్ అడ్మిషన్స్ ద్వారా ప్రవేశాలు సాధించిన విద్యార్థులకు వసతిగృహం కేటాయించరాదన్న నిర్ణయాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ పాల్గొన్నారు.



శాప్‌కు పోలీసుల చేదోడు కావాలి


ఎస్పీతో రవినాయుడు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) కార్యక్రమాల్లో పోలీసు వ్యవస్థ భాగస్వామ్యమైతే క్రీడా రంగంలో మరిన్ని ఫలితాలు సాధించవచ్చని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అభిప్రాయపడ్డారు. సోమవారం ఉదయం ఆయన ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన ఆలోచనలను ఎస్పీకి వివరించగా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

వాకర్స్‌కు ఆస్టర్ నారాయణాద్రి చేయూత

● 250 ఫస్ట్ ఎయిడ్ కిట్ల వితరణ


ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ప్రివిలేజ్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి సోమవారం 250 ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేసింది. ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కిట్లు, ప్రివిలేజ్ కార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రివిలేజ్ కార్డుల ద్వారా అన్ని రకాల చికిత్సకు రాయితీలు లభిస్తాయన్నారు. ఆస్పత్రి వారు నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులు, వలంటీరు సర్వీసులను అభినందించారు. ఆస్పత్రి సీవోవో డాక్టర్ శ్రీధర్‌మునిని మాట్లాడుతూ రూ.1,999కే మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, సీనియర్ వాకర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని కురగాయల మార్కెట్


మార్కెట్ స్థలాన్ని కారు పార్కింగ్‌కు వాడుకుంటున్న దృశ్యం

తిరుపతి(ఎమ్మార్‌పల్లి), అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మార్‌పల్లి ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ అభివృద్ధికి నోచుకోలేదు. 2020 నవంబర్ 20వ తేదీన రూ.52.68 లక్షలతో దీన్ని ప్రారంభించారు. తర్వాత దాని నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. పైగా సౌకర్యాలు సరిగా లేకపోవడంతో అటు కొనుగోలు దారులు, ఇటు వ్యాపారులు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపలేదు. క్రమేణా మరుగునపడిపోయింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ స్పందించి మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్చరీ క్రీడాకారుడికి అభినందన


గణేష్‌ను అభినందిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్(విలువిద్య) పోటీల్లో బంగారు పతకం సాధించిన తిరుమూరు గణేష్ మణిరత్నంను శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అభినందించారు. తిరుపతికి చెందిన గణేష్ మణిరత్నం సోమవారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయంలో శాప్ చైర్మన్‌ను కలిశారు. రవినాయుడు మాట్లాడుతూ శాప్ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తిరుపతి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రామీ గెస్ట్‌లైన్ హోటల్, అకాడమీ గ్రూప్ చైర్మన్ రాజశెట్టి జన్మదినం సందర్భంగా సోమవారం పేదలకు అన్నదానం చేశారు. హోటల్ ఆవరణలో నిర్మించిన వరసిద్ధి మహాగణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేసి, మహాకుంభాభిషేకం నిర్వహించారు. హోటల్ సిబ్బందికి వస్త్ర బహుమానం అందించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం దేశవ్యాప్తంగా వెయ్యి ఉద్యోగాలు కల్పిస్తామని రాజశెట్టి ప్రకటించారు. కార్యక్రమంలో జీఎం వంశీకిరణ్, అడ్మిన్ మేనేజర్ భానుప్రకాష్, అకాడమి వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరి పాల్గొన్నారు.

సీనియర్ కళాకారుడి మృతి


ఆలూరు శ్రీధర్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన టీటీడీ అన్నమాచార్య ప్రాజక్టు సీనియర్ కళాకారుడు ఆలూరు శ్రీధర్ సోమవారం మరణించారు. అనారోగ్యంతో కొంతకాలంగా చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీధర్ తబలా, దిథమ్‌ప్యాడ్ ప్లేయర్‌గా తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధులు. ఆయన తల్లి వరలక్ష్మి హరికథ కళాకారిణి. సోదరుడు రాజమోహన్ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడిగా సేవలందిస్తున్నారు. శ్రీధర్ సినిమా రంగంలో ప్రముఖ సంగీత దర్శకుల వద్ద పనిచేశారు. విదేశాల్లో అనేక సంగీత ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆయన మృతి కళారంగానికి తీరని లోటని నగరానికి చెందిన కళాకారులు పేర్కొంటూ సంతాపం ప్రకటించారు.

ఆహ్లాద విరామం.. శిల్పారామం





తిరుచానూరు, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): నగరజీవి ఆహ్లాదంగా సేద తీరేందుకు శిల్పారామం చక్కని విరామం. ఆనందాన్ని పంచే పచ్చదనం, అడవిని తలపించే ఉద్యానవనం, పార్కు మధ్యలో కొలను, బోటింగ్ సరికొత్త అనుభూతి కలిగిస్తాయి. వారాంతంలో యాంపీ థియేటర్ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటాయి. ఇటీవల 12డీ సినిమా మినీ థియేటర్ కూడా అందుబాటులోకి వచ్చింది. పిల్లల కోసం మెట్రో నగరాల్లోని థీమ్ పార్కుల తరహాలో ఆటవస్తువులు అందుబాటులోకి ఉన్నాయి. పాడైన వస్తువులతో ఏర్పాటు చేసిన స్క్రాప్ థీమ్ పార్కు ఆకర్షిస్తుంది. గ్రామీణ సంస్కృతి ప్రతిబింబించే కళాఖండాలు కట్టిపడేస్తాయి. కాటన్, చేనేత వస్త్రాలు, కలంకారీ, టెర్రకోట, చెక్కబొమ్మలు, లెదర్ బ్యాగులు విక్రయిస్తున్న స్టాల్స్ ఆకట్టుకుంటాయి.

● సందర్శన వేళలు

ఉదయం 10 నుంచి రాత్రి 8గంటల వరకు.. వారాంతంలో రాత్రి మరోగంట పొడగింపు.

● మార్గం ఇలా

తిరుపతి-తిరుచానూరు మార్గంలో శిల్పారామం ఉంది. ఆర్టీసీ బస్టాండు నుంచి సుమారు 3 కిలోమీటర్లు.

● ప్రవేశ రుసుం

పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10. పాఠశాలల పిల్లలకు వివిధ గేమ్స్‌లో 50శాతం డిస్కౌంట్ ఇస్తామని శిల్పారామం పరిపాలనాధికారి ఖాదరవల్లి తెలిపారు.

చిన్నారులకు కళలపై శిక్షణ

చిన్నారులకు శాస్త్రీయ సంగీతం, నృత్యం, యోగా వంటి సంప్రదాయ కోర్సులను శిల్పారామం సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చింది. నామమాత్రపు ఫీజు వసూలు చేస్తారు.

● **శాస్త్రీయ సంగీతం:** శని, ఆదివారాల్లో సాయంత్రం 5 నుంచి 6.30గంటల వరకు

● **నృత్యం:** సోమ, బుధ, శుక్రవారాల్లో సాయంత్రం 5 నుంచి 6.30గంట వరకు

● **యోగా:** సోమ, శనివారాల్లో ఉదయం 6 నుంచి 8గంటల వరకు

● **కరాటే:** మంగళ, గురు, శనివారాల్లో సాయత్రం 5 నుంచి 6.30గంటల వరకు

● కోర్సు ఫీజు తదితర వివరాలకు సంప్రదించాల్సిన సెల్: 8886652020.











రూ.10నాణేల ఆమోదంపై ప్రచారం


ప్రచారం చేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు, సిబ్బంది

తిరుపతి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రూ.10 నాణేల ఆమోదంపై కెనరా బ్యాంకు సర్కిల్ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ప్రచారం నిర్వహించారు. దీనికి సంబంధించిన ప్రచార వాహనాన్ని బ్యాంకు జీఎం పాండురంగ మిథంతాయా ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన కస్టమర్లకు నాణేలను పంపిణీ చేశారు. ఎలాంటి సందేహమూ లేకుండా నాణేలను చలామణి చేసుకోవాలని కోరారు. డీజీఎం జి.ఎస్.మూర్తి, రీజనల్ హెడ్ టి.నాగరాజు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు సర్కిల్, రీజినల్ ఆఫీస్ సిబ్బంది, ఫీల్డ్ స్టాఫ్స్, బిజినెస్ కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో అందేలా చూడండి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నేతలు

తిరుపతి (వైద్యం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏజన్సీ నిర్వాహకులు కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోగా పీఎఫ్, ఈఎస్ఐ వంటివి కూడా వర్తింపజేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. తక్కువ మంది కార్మికులతో ఎక్కువ పనిచేయిస్తూ శ్రమను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీలోపు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తొమ్మిది మంది ఎంపిక


అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తొమ్మిది మంది ఎంపికయ్యారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఈ ఇంటర్వ్యూలను చేపట్టింది. ఎంబీఏ చదువుకుంటున్న 35 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరి ప్రతిభను పరీక్షించి 25 మందిని షార్ట్ లిస్టు చేశారు. వీరిలో తొమ్మిది మందిని ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో ఎంపిక చేశారు. విద్యార్థులను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ నరసయ్య అభినందించారు.

కైలాసనాథ కోనకు భక్తుల నిషేధం

నారాయణవనం (ఆంధ్రజ్యోతి) , అక్టోబరు 14: తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండల పరిధిలో ఉన్న కైలాసనాథ కోనకు భక్తులను నిషేధిస్తున్నట్లు ఈవో కృష్ణనాయక్ తెలిపారు. జలపాతం వద్ద నీటి ఉధృతి ఎక్కువగా ఉంటుందని, కలెక్టర్ ఆదేశాల మేరకు భక్తులు, పర్యాటకుల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నడకతో ఆరోగ్యం


ఎమ్మెల్యే శ్రీనివాసులు దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): నడకతో ఆరోగ్యంగా ఉంటామని, అప్పుడే జీవితం సాఫీగా సాగుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఉదయం ఆఫీసర్స్ క్లబ్‌లో 15 వాకర్ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రోజూ నడక, యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలన్నారు. తిరుపతిలోని పార్కులలో నడక కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం 80 ఏళ్లు దాటిన వాకర్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేరూరు సుధాకర్ రెడ్డి, కోనేటి రవిరాజు, ప్రతాప్, బెల్లంకొండ సురేష్, రాజారెడ్డి, పాలకల మల్లికార్జున్, ఇనుకొండ సుబ్రమణ్యం, మహేష్ యాదవ్, జగన్నాథం పాల్గొన్నారు.

ఆర్టీసీ కళాకారుడికి అభినందన


మల్లికార్జునను సన్మానిస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కళారంగంలో రాణిస్తున్న ఆర్టీసీ అలిపిరి డిపో ఉద్యోగి బి.మల్లికార్జునయ్యను సోమవారం ప్రజారవాణాధికారి కార్యాలయంలో ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఉద్యోగం చేస్తూనే వందకుపైగా నాటకాలలో వివిధ పాత్రలు ధరించి ప్రేక్షకులను అలరించడంపై అభినందించారు. అనేక అవార్డులు అందుకున్న కళాకారుడు ఆర్టీసీ ఉద్యోగిగా ఉండడం గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, డీఎం బాలాజీ, ఈయూ నాయకులు తాండాయం సత్యనారాయణ, మస్తాన్, గురునాథం, సతీష్ పాల్గొన్నారు.

కంటైనర్ తొలగించండి సారూ...!



ఏర్పేడు, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఇసుక తాగేలి చెరువుకు మల్లిమడుగు ప్రాజెక్టు సహా ఇతర ప్రాంతాల వర్షపునీరు వచ్చే ప్రధాన వరవ కాలువపై కంటైనర్ ఉంది. రోడ్డు పక్కన గ్యాస్ పైపులైన్ పనులు చేసేవారు ఏర్పాటు చేసిన కంటైనర్ కారణంగా కాలువ పూడిపోయింది. అటు ఆర్అండ్‌బీ, ఇటు జల వనరుల శాఖ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. స్థానికులు కంటైనర్ ఏర్పాటును అడ్డుకున్నా గ్యాస్ కంపెనీ సిబ్బంది కాలువపైనే పెట్టారు. రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా సంబంధిత అధికారులు కంటైనర్‌ను తొలగించి ఇసుకతాగేలి చెరువుకు నీరు వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఆగమోక్తంగా మృత్యుంజయుడికి పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో అభిషేకించారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

స్టార్టర్ల దొంగ అనుకుని...

ఏర్పేడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేర్లపాక సమీప గ్రామాల్లో కొద్దిరోజులుగా మోటర్ల చోరీ జరుగుతోంది. దీంతో భయాందోళనకు గురైన మేర్లపాక గ్రామస్తులు ఆదివారం రాత్రి గ్రామశివార్లలో తిరుగుతున్న ఓ యువకుడిని పట్టుకుని స్తంభానికి కటేసి సోమవారం ఉదయం పోలీసులకు అప్పగించారు. అయితే ఆ వ్యక్తిని ఏర్పేడు సీఐ విచారించగా తిరుపతి తాతయ్యగుంటకు చెందిన చిరంజీవిగా గుర్తించారు. చల్లపాళెంలో జరుతున్న జాతరకు వెళుతుండగా ద్విచక్రవాహనంలో పెట్రోల్ అయిపోయి మేర్లపాక వద్ద ఆగిపోయిందన్నాడు. అయితే గ్రామస్తులు అనుమానంతో యువకుడిని పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. తిరిగి అతనిని వదలిపెట్టారు.



ఒకవైపు వర్షం. మరోవైపు అర కి.మీపైగా క్యూలైను. ఇలా నగరిలో సోమవారం ఇండేన్ గ్యాస్ సిలిండర్లు తీసుకోవాల్సి వచ్చింది. నగరి, నింద్ర, విజయపురం మండలాల పరిధిలోని 7500 మంది వినియోగదారులు తరచూ ఇలా అవస్థలు పడుతూనే వున్నారు. అధికారులకు చెబితే సిలిండర్లు సక్రమంగా రాకపోవడంతో తామేమి చేయలేకపోతున్నామని చెబుతున్నారని వినియోగదారులు అంటున్నారు.

- నగరి, ఆంధ్రజ్యోతి



తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనార్థం సోమవారం వచ్చిన కర్ణాటక భక్తురాలు మమతా ఆనంద్ క్యూలైన్‌లో హ్యాండ్ బాగ్ పోగొట్టుకున్నారు. ఇది మరో భక్తురాలికి దొరికింది. దర్శనం తరువాత హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదని బాధితురాలు విజిలెన్స్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ద్వారా ఆ బ్యాగు తీసుకున్న మహిళను గుర్తించి ఇప్పించారు. అందులో రూ.54.200నగదు, బ్యాంకు కార్డులు ఉన్నాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



తమ వీధిలో మద్యం దుకాణం వద్దని పాత బలరాం థియేటర్ వీధివాసులు ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. గతంలో బలరాం థియేటర్ మార్గంలో మద్యం దుకాణం ఉండేదని దాన్ని తొలగించాలంటూ పోరాటం చేశామన్నారు. హైకోర్టు ఆదేశాలతో దుకాణాన్ని తొలగించినట్లు తెలిపారు. అయితే మళ్లీ ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



తిరుపతి రుయాస్పత్రిలో పురిటి బిడ్డలకూ అవస్థలు తప్పడం లేదు. ప్రసూతి ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ లేదు. దీంతో అక్కడి పిల్లలను రుయా ఏడీ భవనంలో ఉన్న కేంద్రానికి తీసుకొస్తున్నారు. ఇక్కడ సాధారణ, అత్యవసర చికిత్స పొందే రోగులతోపాటు శిశువులకూ స్కానింగ్ చేయాల్సి రావడంతో, గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. పురిటి బిడ్డలుండే వార్డులోనే స్కానింగ్ ఏర్పాటుపై అధికారులు పట్టించుకోవడం లేదు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

మన సంపద



దొంగలమండపం

సిటీ

కరకంబాడి రోడ్డులో అన్నమాచార్య కాలేజీ వెనుక వెంకటాపురం చెరువులో ఈ పురాతన మండపం కనిపిస్తుంది. ఎవరు కట్టించారో, ఏ కాలంనాటిదో గానీ శిల్పశోభితమైన రాతి స్తంభాలతో, దూలాలతో శిథిలస్థితిలో ఉంది. శ్రీరాముడు, మురళీకృష్ణుడు, శ్రీ వేంకటేశ్వరుడు, బలరాముడు, ఆంజనేయస్వామి, గరుడ, నటరాజ వంటి దేవతామూర్తుల బొమ్మలు, శంఖు, చక్రం, నామం, పద్మాకృతులు ఈ మండపం స్తంభాలమీద ఉన్నాయి. 16 స్తంభాల్లో ఒకటి కూలిపోయింది. పైన మొలచిన మొక్కలు వృక్షాలుగా మారి మండపం బీటలువారింది. దీన్ని ఈ ప్రాంతంలో దొంగలమండపం అని పిలుస్తారు. ఊరికి దూరంగా విసిరేసినట్లు ఉండే ఈ మండపంలో ఒకప్పుడు దొంగలు తలదాచుకునేవారని అంటారు. నిజానికి ఇది తిరుమల కొండకు కాలినడకన దూరప్రాంతాల నుంచీ వచ్చే భక్తులు సేదదీరేందుకు విజయనగర కాలంలో నిర్మించిన దారి మండపం కావచ్చు.



పురాతన చరిత్రక సంపద పట్ల మన నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నట్టుగా అలనాటి వైభవానికి శిథిలసాక్ష్యంగా ఇప్పుడు కనిపిస్తోంది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి





హత్యకేసులో నిందితుడి లొంగుబాటు



నిందితుడిని చూపుతున్న సీఐ కిషోర్‌బాబు

చిల్లకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తొణుకుమాల సమీపంలో ఇటీవల జరిగిన వెంకటేశ్వర్లు హత్య కేసులోని నిందితుడు అంకయ్య సోమవారం లొంగిపోయినట్లు సీఐ కిషోర్‌బాబు సోమవారం తెలిపారు. దక్కిలి మండలం దగ్గవోలు గ్రామానికి చెందిన అంకయ్య, అతడి భార్య లక్ష్మమ్మ, సైదాపురం బీసీ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు, అతని భార్య సుబ్బమ్మ తొణుమాల సమీపంలోని అరుణమ్మకు చెందిన మామిడి తోటలో కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు. మద్యానికి బానిసలై జల్సాలకు అలవాటుపడి వీరు పొలాల్లో విద్యుత్‌మోటారు వైర్లను చోరీ చేసి విక్రయించేవారు. సెప్టెంబరు 9వ తేదీ రాత్రి మోటారు చోరీ చేసి, అందులోని వైరును పంచుకునే విషయంలో అంకయ్య, వెంకటేశ్వర్లుకు మధ్య వివాదం ఏర్పడింది. అంకయ్య గడ్డపారతో దాడి చేయడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని మామిడి తోటకు సమీపంలోని తెలుగుగంగ కాలువ కట్టపై పూడ్చిపెట్టి అంకయ్య పరారయ్యాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అంకయ్య సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అధికారుల సమక్షంలో లొంగిపోయినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది ఆర్‌పీ రాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు


తడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అపాచీలో కార్మికురాలి హత్య కేసులో నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. చిట్టమూరు మండలం కుమ్మరిపాళెం గ్రామానికి చెందిన గొంజి వనజ అపాచీ పరిశ్రమలో పనిచేస్తుండేది. గత శుక్రవారం విధుల్లో ఉన్న ఆమెను.. అదే గ్రామానికి చెందిన మీజూరు సురేష్ కత్తెరతో దాడిచేసి హత్యచేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పరారీలో ఉన్న సురేష్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనపరచిన ఎస్‌ఐ కొండపనాయుడు, సిబ్బందిని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ అభినందించారు. రివార్డు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

ఘాట్‌రోడ్డులో అదుపుతప్పిన కారు



తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో సోమవారం సాయంత్రం ఓ కారు అదుపు తప్పింది. అదృష్టవశాత్తు కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. తమిళనాడుకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారి దర్శనం ముగించుకుని తమ కారులో సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఈమేరకు మార్గంలోని వినాయకస్వామి ఆలయం వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి కుడివైపునున్న చిన్నపాటి గట్టును ఢీకొని ఆగిపోయింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. కారులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

ఉత్తమ సేవకులకు ప్రశంసా పత్రాలు, రివార్డులు



ఎస్పీ చేతుల మీదుగా రివార్డులు అందుకుంటున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు విలువైన సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందిని సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వారికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, నాగభూషణరావు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, సాయుధ దళం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

విపత్తును ఎదుర్కొనేలా సంసిద్ధంకండి

● టీటీడీ అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో విపత్తులను ఎదుర్కొనేలా సంసిద్ధంగా ఉండాలని టీటీడీ అధికారులను ఈవో శ్యామలరావు ఆదేశించారు. విపత్తు నిర్వహణ ప్రణాళికపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి సోమవారం ఆయన అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. 2021లో భారీ కొండ చరియలు విరిగి పడిన ఘటనతో టీటీడీ 700 పేజీల విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈప్రణాళికను మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈవో స్థాయిలో విపత్తుల నివారణ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అదనపు ఈవో ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సమన్వయ కమిటీ ఉందన్నారు. అగ్నిమాపక శాఖ, ఆరోగ్యశాఖ, విజిలెన్స్ విభాగం, ఇతర కీలకమైన శాఖల విభాగాధిపతులు, తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఘాట్‌రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. జనరేటర్లు నడపడానికి ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఐటీ విభాగం కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అంబులెన్సులను అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలన్నారు. ఘాట్‌రోడ్డుల్లో ఎక్స్‌కవేటర్లు, ట్రక్కులు, ట్రాక్టర్లు, తగిన సిబ్బందిని సంసిద్ధంగా ఉంచుకుని సమాయత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు, జిల్లా పోలీసుల, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే పోలీసులకూ సమాచారం ఇవ్వండి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న క్రమంలో పోలీసులు అప్రమత్తంగా వుండాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం డయల్ 112, లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. రైల్వే అండర్ బ్రిడ్జిల కింద వెళ్ళకూడదని, పాత భవనాల్లో వుండే వాళ్ళు వెంటనే ఖాళీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

తిరుపతి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో వరద ముంపు ప్రాంతాల ప్రజలకోసం పునరావాస కేంద్రాలను అధికారులు సోమవారం పరిశీలించారు. పేరూరు హరిపురం కాలనీలోని శ్రీచైతన్య స్కూల్, వెంకటపతి నగర్‌లోని పాఠశాలను తహసీల్దారు రామాంజులనాయక్, ఎంపీడీవో రామచంద్ర సందర్శించారు. భారీ వర్షాలు కురిస్తే వీటిలో రిహాబిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచనలు చేశారు.

కరెంటు సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు

● డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూములు

● సీఎండీ సంతోషరావు వెల్లడి

తిరుపతి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికలతో సదరన్ డిస్కం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. డిస్కం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. సర్కిల్, డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకవద్దని, కరెంట్ లైన్ల కింద నిలబడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ స్తంభాలు కూలినా.. తీగలు తెగినా తక్షణమే సమీప అధికారులకు, సిబ్బందికి సమాచారమివ్వాలని కోరారు.

కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుపాను ప్రభావం అధికంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం 33కేవీ ఆర్డీవో ఆఫీస్ సబ్‌స్టేషన్, న్యూమారుతీనగర్, ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కరెంటు సమస్యా.. ఫోను చేయండి

టోల్‌ఫ్రీ నెంబరు: 1912-1800425155333

వాట్సాప్ నెంబరు: 91333 31912

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.56 కోట్లు

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.2.56 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 86,900 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,739 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

17 నాటికి విజన్ డాక్యుమెంట్ సిద్ధం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఈనెల 17 నాటికి సిద్ధమవుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ వర్చువల్ విధానంలో కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ వివరిస్తూ రాబోయే ఐదు సంవత్సరాలకు సంబంధించిన మండల విజన్ డాక్యుమెంట్ పూర్తయిందన్నారు. జిల్లా విజన్ డాక్యుమెంట్ పురోగతిలో ఉందని, 17వ తేదీ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

రేపు రుయాలో పాలియేటివ్ కేంద్రం ప్రారంభం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రుయాస్పత్రిలో బుధవారం 10 పడకలతో ప్రత్యేక పాలియేటివ్ (ఉచిత ఉపశమన సంరక్షణ) కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామని సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. రోటరీ క్లబ్ సహకారంతో ఈ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై ఆయన సోమవారం రోటరీ క్లబ్ నిర్వాహకులతో సమీక్షించారు. ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని, వృద్ధులు, క్యాన్సర్ బాధితుల కోసం దీన్ని ప్రారంభిస్తున్నా మని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు

నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కు తిరుపతికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. రాజమండ్రిలో ఇటీవల జరిగిన సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 18, 16, 14విభాగాలలో బి.గణేష్‌ప్రియవర్ధన్(డిస్కస్‌త్రో), బి.ప్రణీత్‌కుమార్, కె.హరిచరణ్(షాట్‌పుట్), బి.శర్మి(ట్రైయాతిలాన్) ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా తరపున ఎంపికయ్యారు. వీరు ఈనెల 17నుంచి 19వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే 35వ సౌత్‌జోన్ నేషనల్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొంటారు. అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గిరిధర్‌రాజు, రాబర్ట్ వారిని అభినందించారు.

అప్రమత్తంగా ఉండండి

కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించండి



తిరుపతి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం పడడంతో అధికారులతో కలసి నగరంలో పలుచోట్ల ఆమె పర్యటించారు. పేరూరు చెరువు నుంచి నీరువచ్చే ప్రాంతాలు, కపిలతీర్థం, మాల్వాడి గుండం నుంచి నీరు వెళ్లే ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంట, జీవకోన ప్రాంతాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల్లో వర్ష సూచన ఎక్కువగా ఉందని, నీరు నిలబడకుండా, రోడ్డుపైకి రాకుండా ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలన్నారు. కాలువలపై అక్రమ నిర్మాణాల తొలగింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పాన్ చెరువులో అక్రమంగా నిర్మాణాలు ఉన్నాయని చెప్పడంతో పరిశీలించారు. సర్వే చేసి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఆర్డీవో రామ్మోహన్, ఎస్ఈ శ్యాంసుందర్, ఇరిగేషన్ ఎస్ఈ శివారెడ్డి, అర్బన్, రూరల్ తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, రామాంజుల నాయక్, ఎంఈలు తులసీకుమార్, గోమతి తదితరులు ఉన్నారు.

● హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకోండి

వర్షాల వల్ల ఏదైనా ఇబ్బంది కలిగితే 0877 2256766 హెల్ప్‌లైన్ నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కమిషనర్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటరును ఆమె పరిశీలించారు.

వెంకన్న భక్తులకు మెరుగైన సేవలు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన సేవలందించామని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ, పోలీసు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికుల సమష్టి కృషితో ఆర్టీసీకి రికార్డుస్థాయి ఆదాయం వచ్చిందని తెలిపారు. గరుడసేవ రోజున చిన్నపాటి పొరపాటు లేకుండా ప్రశాంతంగా ట్రాఫిక్ నడిచిందని గుర్తు చేశారు. అన్ని విభాగాల సమష్టి కృషి ఫలితంగానే బ్రహ్మోత్సవాలు విజయవంత మయ్యాయని పేర్కొన్నారు. సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డుప్రసాదాలు అందజేశారు.



ఆటో బోల్తా: ఒకరికి గాయాలు


ప్రమాదంలో స్థలంలో వెంకటేశ్వర్లు

బాలాయపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలం చుట్టి బస్‌షెల్టర్ సమీపంలో సోమవారం ప్రమాదశావత్తు ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు... గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన పట్టపు వెంకటేశ్వర్లు తిరుపతికి వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా మన్నూరు మలుపు దాటాక చుట్టి బస్సు షెల్టర్ సమీపంలో గేదె అడ్డు రావడంతో బోల్తా పడింది. వెంకటేశ్వర్లు ఆటో కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వెంకటేశ్వర్లును ప్రైవేటు వాహనంలో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువులకు సమాచారం ఇచ్చారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


రాజేంద్ర (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం రైల్వేగేట్ సమీపంలో సోమవారం ఉదయం మండలంలోని కట్టువపల్లి గ్రామానికి చెందిన ఈదూరు రాజేంద్ర(33) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఉదయం 7 గంటల సమయంలో రైల్వేగేటు వంతెనకు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు కింద రాజేంద్ర పడుకోవడంతో తల, మొండెం రెండుగా తెగిపోయాయి. మృతదేహం వద్ద ఉన్న సెల్‌ఫోన్, ఆధార్ కార్డుల ఆధారంగా కట్టువపల్లి గ్రామానికి చెందిన రాజేంద్రగా రైల్వే సిబ్బంది గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సూళ్లూరుపేట రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడుకి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. రాజేంద్రకు కొంత కాలంగా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

చెంగాళమ్మ ప్రసాదంలో కొరవడిన నాణ్యత

సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చెంగాలమ్మ ఆలయంలో పాలన గాడి తప్పింది. పాలకవర్గం లేకపోవడంతో కొందమంది ఉద్యోగులు ఆడింతే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. ఆలయంలో తయారు చేసే ప్రసాదంలో నాణ్యత లేదని భక్తుల నుంచి విమర్శలు వస్తున్నా దేవదాయశాఖ అధికారుల్లో చలనం లేదు. ఇంట్లో జరిగే వేడుకలకు ఏదైన ఫలహారాలు చేయాలంటే ఒకటికి పదిసార్లు పరిశీలించి, రుచిచూసి తయారు చేస్తాం. అయితే వందలాది మంది భక్తులకు ఇచ్చే దేవుడి లడ్డు, పులిహోర తదితర వాటిల్లో నాణ్యత నేతిబీర చందంగా మారింది. పాలకవర్గం లేకపోవడంతో ఆలయంలో కాంట్రాక్టు ఉద్యోగులదే హవాగా ఉంది. ఆలయం వద్ద కౌంటర్‌లో 80గ్రాముల లడ్డు


లడ్డూలను ఆరుబయటే ఆరబెట్టిన దృశ్యం - పులిహోర ప్యాకెట్లు


మరుగుదొడ్డిలో రూంలో లడ్డూలు తయారు చేసే పాత్రలు

రూ.15, 150 గ్రాముల పులిహార రూ.10కు విక్రయిస్తున్నారు. లడ్డులో నాణ్యత లేదని, పులిహార ప్రసాదంలో ఇసుక, సన్నరాళ్లు వస్తున్నాయని భక్తులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా పులిహోర తయారీకి వినియోగించే చింతపండులో నాణ్యత లేదు. నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఆలయాల్లో ప్రసాదాలు ప్రత్యేక వంటశాలలో తయారు చేయాలి. చుట్టుప్రక్కల పరిసరాలు శుభ్రంగా ఉండాలి. చెంగాలమ్మ ఆలయంలో ప్రసాదం తయారీ చేసే పరిసరాలు శుభ్రంగా లేవు. ప్రసాదాలు తయారీకి వినియోగించే పాత్రలను మరుగుదొడ్డిలో శుభ్రం చేస్తున్నారు. ఆలయ అధికారులు తయారు చేసి ఇచ్చిందే మహాప్రసాదంగా భక్తులు తీసుకోవాల్సి వస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూజా సామగ్రి అధిక ధరకు విక్రయం

ఆలయ ఆవరణలోని దుకాణాల్లో అమ్మవారికి పూజకు వినియోగించే పూజా సామగ్రి, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్లు, క్యాన్లను కాంట్రాక్టు దక్కించుకొన్న వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పూజా సామగ్రిలో కొబ్బరికాయ, అగర్‌వత్తులు, నిమ్మకాయ, తమలపాకు వక్కలు, పపు, కుంకం కలిపి రూ.50కి విక్రయించాల్సి ఉంది. అయితే దుకాణ దారులు రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. అదే విధంగా కూల్ డ్రింక్స్, వాటర్ బాటిళ్లు, క్యాన్‌లు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఆలయ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని భక్తులు విమర్శిస్తున్నారు.

అత్త, మామలపై అల్లుడి దాడి


గాయపడిన ధనలక్ష్మి, కృష్ణారావు

గూడూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయమై వివాదం చెలరేగడంతో అత్త, మామలపై అల్లుడు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ కథనం మేరకు... స్థానిక ఇందిరానగర్‌కు చెందిన కృష్ణారావు, ధనలక్ష్మి దంపతులు చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె మహాలక్ష్మిని విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యానికి ఇచ్చి వివాహం చేశారు. సుబ్రహ్మణ్యానికి, అత్తా, మామలైన ధనలక్ష్మి, కృష్ణారావుకు ఆస్తి విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సుబ్రహ్మణ్యం విజయవాడ నుంచి మరో నలుగురితో కలిసి గూడూరుకు వచ్చారు. ఆస్తి విషయమై మాటామాటా పెరిగి వివాదంగా మారడంతో ధనలక్ష్మి, కృష్ణారావుపై సుబ్రహ్మణ్యం రాడ్డుతో దాడి చేశాడు. కృష్ణారావు, ధనలక్ష్మి తలకు తీవ్ర గాయాలవడంతో వారిని ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: పాశిం

గూడూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొండాగుంట గ్రామంలో పల్లెపండుగ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు అధ్వానంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో రూ.2కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా కొండాగుంట గ్రామంలో రూ. 10లక్షలతో సీసీ, డ్రైనేజీ కాలువల పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నేరవేర్చుతుందని సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, శ్రీనివాసులురెడ్డి, గుండాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వేలను పరిశీలించిన డీఎస్పీ, తహసీల్దార్


కలవకూరు కాజ్‌వేను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

పెళ్లకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, పెళ్లకూరు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని కలవకూరు, కప్పగుంటకండ్రిగ సమీపంలోని స్వర్ణముఖినదిపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వేలను డీఎస్పీ, తహసీల్దార్ వేర్వేరుగా పరిశీలించారు. వరద ప్రవాహం అధికంగా ఉండే కాజ్‌వేలు, వాగులు, వంకలు ఉన్నచోట ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో అధికారులకు సమాచార అందిస్తే సహాయ చర్యలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, వీఆర్వో వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

వర్షం.. ఆపై ఈదురు గాలులు


దామరాయి వద్ద ఎల్లిపైర్ల వేసిన పొలాల్లో నిలిచిన వర్షపునీరు

సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సూళ్లూరుపేటలో సోమవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున ప్రారంభమైన వాన మధ్యాహ్నాం 12 గంటల వరకు పడింది. గాండ్లవీధి, సాయినగర్ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా జీఎన్‌టీ రోడ్డు గుంతలమయంగా మారింది. తీరప్రాంతాలైన కొరిడి, పేర్నాడు, దామరాయి, కడపత్ర, కొనతత్తూరు, తోటకట్ల గ్రామాల్లో ఎల్లిపైర్లు నీటి మునిగాయి. మధ్నాహ్నాం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో కూడిన తేలికపాటి జల్లులతో వర్షం కురిసింది. కొరిడి - పేర్నాడు రోడ్డు, మండల పరిషత్, ఆర్డీవో కార్యాలయాల ప్రాంతం రొచ్చురొచ్చుగా మారాయి.

విద్యార్థులందరికీ హాస్టల్ సీట్లు ఇవ్వాలి

తిరుపతి(విద్య), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నడిచే విద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులందరికీ హాస్టల్ సీట్లు కేటాయించాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హేమాద్రి యాదవ్ కోరారు. ఈ మేరకు జేఏపీ నాయకులు సోమవారం డీఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. హేమాద్రి మాట్లాడుతూ పేద విద్యార్థులకు కళాశాల సీటు వచ్చినా వసతిగృహంలో రాకపోవడంతో ప్రైవేట్ హాస్టళ్లను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. టీటీడీ విద్యాసంస్థల్లో 60 శాతం విద్యార్థులకు హాస్టల్ సీట్లు కేటాయించాలని, 40 శాతం మాత్రమే డేస్కాలర్స్‌గా భర్తీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. స్పాట్ అడ్మిషన్స్ ద్వారా ప్రవేశాలు సాధించిన విద్యార్థులకు వసతిగృహం కేటాయించరాదన్న నిర్ణయాన్ని ఖండిస్తున్నామని చెప్పారు.

వేతనాలు సకాలంలో అందేలా చూడండి

తిరుపతి(వైద్యం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

లోతట్టు గ్రామాల్లో అధికారుల పర్యటన

చిట్టమూరు, అక్టోబర్ 14 (ఆంధజ్యోతి): తుపాన్ ప్రభావం వల్ల భారీ వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు గ్రామాల్లో మండల అధికారులు సోమవారం పర్యటించారు. తహసీల్దారు ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ చిన్న బలరామయ్య, రీ సర్వే డీటీ నిరంజన్‌కుమార్, ఏఎస్‌వో భాషా మండలంలోని లోతట్టు గ్రామాలను సందర్శించారు. రొయ్యలకాలువ సమీపంలోని పిట్టివానిపల్లి గ్రామస్తులను అప్రమత్తం చేశారు. రొయ్యల కాలువ ప్రవహిస్తే ఆ గ్రామం నీటమునిగి రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామస్తులతో మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.


రొయ్యల కాలువను పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్ఐ

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు


తూపిలిపాళెం సముద్రతీరం వద్ద తహసీల్దారు, ఎస్ఐ

వాకాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన అల్పపీడనంగా మారి సోమవారం భారీ వర్షాలు కురవడంతో తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఎస్ఐ నాగబాబు మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలో తీర ప్రాంతాలైన దుగరాజపట్నం, కొండూరుపాళెం, అంజలాపురం, తూపిలిపాళెం తదితర తీరప్రాంత గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు పర్యటించి పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజల సౌకర్యార్థం కొండూరుపాళెం, బాలిరెడ్డిపాళెం, ముట్టెంబాక, తూపిలిపాళెం, గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు రామయ్య మాట్లాడుతూ సముద్రంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. ఉరుముల మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉండడంతో పొలాల్లోకి వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలన్నారు.

తీరప్రాంత గ్రామాల పరిశీలన

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో అధికారులు సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని స్వర్ణముఖి నది పరివాహక గ్రామాలైన రుద్రవరం, ఉనుగుంటపాళెం, తిన్నెలపూడి, గూడలి గ్రామాల్లో తహసీల్దారుతో పాటు ఎంపీడీవో వేణు, వివిధ శాఖల అధికారులు పర్యటించారు. లోతట్టు గ్రామాలైన కర్లపూడి, రుద్రవరం, గోవిందపల్లి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. రేషన్ దుకాణాల వద్ద నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచారు.


మత్స్యకారులకు సూచనలిస్తున్న తహసీల్దారు జయజయరావు

ముంపు ప్రాంతాల్లో....

దొరవారిసత్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంపు ప్రాంతాల్లో అధికారుల బృందం పర్యటించింది. తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్ఐ అజయ్‌కుమార్, ఇతర శాఖల అధికారులతో కలసి పులికాట్ తీర గ్రామాలైన మీజూరు ప్రాంతంతో పాటు, కాళంగి పరివాహక ప్రాంతాలైన వేటగిరిపాళెం, బురదమడుగు, తల్లంపాడు, వివిఎస్ఆర్ నగర్, తనియాలి గిరిజన కాలనీల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుకు భవనాలను పరిశీలించారు. మూడు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మలేషియన్ అథ్లెటిక్స్‌లో నాయుడుపేటవాసికి బంగారు పతకం


బంగారు పతకాన్ని అందుకుంటున్న వెంకటరావు

నాయుడుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మలేషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కౌలాలంపూర్‌లో జరిగిన 36వ చాంపియన్ షిప్ పోటీల్లో నాయుడుపేట వాసి వెంకటరావుకు బంగారు పతకం లభించింది. నాయుడుపేట మండలంలోని పుదూరు సచివాలయ సెక్రటరీగా పనిచేస్తున్న వెంకటరావు హైజంప్ విభాగంలో బంగారు పతకం సాధించి భారతదేశ త్రివర్ణ పతకాన్ని రెపరెపలాడించారు. పలువురు ఉద్యోగులు వెంకటరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కేంద్రమంత్రిని కలసిన కోమారి

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ నాయకుడు కోమారి కోటేశ్వరరావు హైదరాబాదులో కలిశారు. గూడూరు నియోజకవర్గంలో సమస్యలను కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు కోటేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా రాజకీయాలపై కిషన్‌రెడ్డితో చర్చించినట్లు చెప్పారు.



గ్రామీణాభివృద్ధి కోసమే పంచాయతీ వారోత్సవాలు


సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో కోటేశ్వరరావు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి కోసమే పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పెట్లూరు, పంజాం, మొగళ్లగుంట పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి రూ.2కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

రూ.10నాణేల ఆమోదంపై ప్రచారం

తిరుపతి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రూ.10 నాణేల ఆమోదంపై కెనరా బ్యాంకు సర్కిల్ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ప్రచారం నిర్వహించారు. దీనికి సంబంధించిన ప్రచార వాహనాన్ని బ్యాంకు జీఎం పాండురంగ మిథంతాయా ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన కస్టమర్లకు నాణేలను పంపిణీ చేశారు. ఎలాంటి సందేహమూ లేకుండా నాణేలను చలామణి చేసుకోవాలని కోరారు. డీజీఎం జి.ఎన్. మూర్తి, రీజనల్ హెడ్ టి.నాగరాజు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు సర్కిల్, రీజనల్ ఆఫీస్ సిబ్బంది, ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు, సిబ్బంది

టీడీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


చాన్‌బాషా మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తండ్రి చాన్‌బాషా(62) ఆదివారం మృతి చెందారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సోమవారం రఫీ నివాసానికి చేరుకొని చాన్‌బాషా మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తుఫాన్ ప్రభావంపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులందరూ అప్రమత్తగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు సూళ్లూరుపేట ప్రాంతంపై తుఫాన్ ప్రభావం అధికంగా ఉండవచ్చునని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందని, అధికారులు అందుబాటులో ఉండి గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. తీరప్రాంత గ్రామాల్లో ప్రజలతో పాటు లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి


భీములవారిపాళెం పడవలరేవును పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో

తడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం తడకు వచ్చిన ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో తుఫాన్ ప్రభావంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే ఆస్కారం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల న్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని ఆదేశించారు. ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. అంతకుముందు భీములవారిపాళెం పడవలరేవులో తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్ పర్యటించి మత్స్యకారులను వేటకు వెళ్లవద్దని సూచించారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో మోస్తరు వర్షం

వెంకటగిరి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగళాఖతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వెంకటగిరిలో సోమవారం మోస్తరు వర్షం పడింది. తెల్లవారు జామున 4గంటల నుంచి వర్షం కురిసింది.

దొరవారిసత్రంలో ముసురు

దొరవారిసత్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం 40.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా, సాయంత్రం వరకు చిన్నపాటి చిరుజల్లులతో ముసురు నెలకొంది.



కైలాసనాథ కోనకు భక్తుల నిషేధం

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండల పరిధిలో ఉన్న కైలాసనాథ కోనకు భక్తులను నిషేధిస్తున్నట్లు ఈవో కృష్ణనాయక్ తెలిపారు. జలపాతం వద్ద నీటి ఉధృతి ఎక్కువగా ఉంటుందని, కలెక్టర్ ఆదేశాల మేరకు భక్తులు, పర్యాటకల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

- నారాయణవనం (ఆంధ్రజ్యోతి)

ఆగమోక్తంగా మృత్యుంజయుడికి పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో అభిషేకించారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

- శ్రీకాళహస్తి(ఆంధ్రజ్యోతి)



రేపు ఊంజల్ సేవ

శ్రీకాళహస్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధ వారం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్ల ఊంజల్‌సేవ నిర్వహించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. రాత్రి 8గంటలకు ఆల య ఆవరణలోని ఊంజల్ మండపం వద్ద సేవ జరుగుతుందని తెలిపారు.

వన సంరక్షణ సమితి అధ్యక్షుడిగా గణేష్



శ్రీకాళహస్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలోని కాసరం పంచాయతీ గొట్టిపూడి ఎస్టీకాలనీలో సోమవారం సాయంత్రం అటవీశాఖ డీఆర్వో రామకృష్ణ ఆధ్వర్యంలో వన సంరక్షణ సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. సమితి అధ్యక్షుడిగా గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు చెంచయ్య, బీట్ అధికారులు సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు దశరథ, వెంకటరమణయ్య, చిన్నయ్య, రవీంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ తొలగించండి సారూ...!

ఏర్పేడు, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఇసుక తాగేలి చెరువుకు మల్లిమడుగు ప్రాజెక్టు సహా ఇతర ప్రాంతాల వర్షపునీరు వచ్చే ప్రధాన వరవ కాలువపై కంటైనర్ ఉంది. రోడ్డు పక్కన గ్యాస్ పైపులైన్ పనులు చేసేవారు ఏర్పాటు చేసిన కంటైనర్ కారణంగా కాలువ పూడిపోయింది. అటు ఆర్‌అండ్‌బీ, ఇటు జల వనరుల శాఖ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. స్థానికులు కంటైనర్ ఏర్పాటును అడ్డుకున్నా గ్యాస్ కంపెనీ సిబ్బంది కాలువపైనే పెట్టారు. రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా సంబంధిత అధికారులు కంటైనర్‌ను తొలగించి ఇసుకతాగేలి చెరువుకు నీరు వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



కాలువపై ఉన్న కంటైనర్

చెరువుకట్టకు మరమ్మతులు చేపట్టండి

వరదయ్యపాళెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలం సంతవేలూరు చెరువుకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఐదు వేల హెక్టార్ల ఆయకట్టు ఉన్న చెరువు కట్ట మరమ్మతులకు పది సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు చెరువు తెగిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్పటి నుంచి నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈ చెరువు కింద సాతంబేడు, కువ్వాకొల్లి, కొండూరు, అంబూరు తదితర గ్రామాల రైతులు పంటలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ ప్రభుత్వం చేస్తున్న హెచ్చరికలతో గ్రామస్తులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి చెరువుకట్టను పటిష్టానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కోతకు గురైన కట్ట

అరుణా నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నాగలాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అరుణానదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది మండలంలోని కారణిలో అనారోగ్యంతో మృతి చెందిన క్రిష్ణయ్య (72) అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా అరుణా నదిలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. అదే రోజు రాత్రి వరకు నాగలాపురం పోలీసులు, సత్యవేడు అగ్నిమాపక దళం సిబ్బంది వడివేలు(38) ఆచూకీ కోసం గాలించారు. చీకటి పడడంతో వెను దిరిగారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నాగలాపురం ఎస్‌ఐ సునీల్‌కుమార్ సిబ్బందితో స్థానిక జాలర్ల సాయంతో అరుణానదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహానికి సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఈ పాపం గత ప్రభుత్వానిదే..

కారణి గ్రామం సమీపంలోని అరుణానదిలో గత వైసీపీ ప్రభుత్వం భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు జరపడంతో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. కారణివాసులకు అంత్యక్రియలు నిర్వహించాలంటే అరుణానదిని దాటాల్సిందే. ఈ నేపథ్యంలో అతి పెద్ద గుంతలో పడి వడివేలు గల్లంతయ్యాడు. ఈత తెలిసినా కూడా గుంతలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడని కుటుంబీకులు భోరున విలపించారు.

శ్రీకాళహస్తికి దారెటు?

- ఆరులేన్ల జాతీయ రహదారిపై రాకపోకలు ప్రారంభం
- సూచికబోర్డులు లేక దారి తప్పుతున్న వాహనదారులు



ఊరందూరు వద్ద ఆరు లేన్ల హైవేపై వాహనాల రాకపోకలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తికి ఎలా వెళ్లాలి? ఈ ప్రశ్న నిత్యం ఆరులేన్ల జాతీయ రహదారిపై వాహనదారులను వేధిస్తోంది. రెండు వారాల క్రితం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలో కొత్తగా నిర్మించిన ఆరులేన్ల జాతీయ రహదారిపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. అయితే పట్టణంలోకి ప్రవేశించే ఇరువైపులా సూచికబోర్డులు లేకపోవడంతో వాహనదారులు వేగంగా ముందుకు వెళ్లిపోతున్నారు. దాంతో శ్రీకాళహస్తి పట్టణంలోకి చేరుకునేందుకు కనిపించిన వారినంతా అడగాల్సి వస్తోంది.

నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు ఆరులేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు మూడేళ్ల క్రితం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని పలు గ్రామీణ ప్రాంతాల మీదుగా ప్రారంభమైంది. తిరపతి నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోకి ప్రవేశించాల్సిన వాహనం మండలంలోని చెర్లోపల్లి వద్ద సర్వీసు రోడ్డు నుంచి సాగాల్సి ఉంది. ఇక్కడ సూచికబోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు నేరుగా వెళ్లిపోతున్నారు. దాంతో ఏపీటూరింజ ఫ్లై ఓవర్ ఎక్కిన వాహనాలు నేరుగా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు చేరుకుంటున్నాయి. ఇక్కడ దారి తప్పామని తెలుసుకుంటున్న వాహనదారులు స్థానికులను అడిగి శ్రీకాళహస్తి - పంగూరు రోడ్డు నుంచి పానగల్ మీదుగా పట్టణంలోకి చేరుకుంటున్నారు. ఈ మార్గంలో పానగల్ వద్ద రైల్వేగేటు ఉండటంతో దారి తప్పి వచ్చిన వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. ఇక మరికొందరు వాహనదారులు ఊరందూరు దాటుకుని నారాయణపురం, పెంకలపాడు, అరవకొత్తూరు మీదుగా శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని ఎన్‌వీఎస్ కల్యాణమండపం వద్ద సర్వీసు రోడ్డుకు మలుపు తీసుకుని పట్టణంలోకి చేరుకుంటున్నారు. మొత్తంగా తిరుపతి నుంచి పట్టణంలోకి రావాల్సిన వాహ నాలు సూచికబోర్డులు లేకపోడంతో 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం అధికంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఇక విధంగా నెల్లూరు, విజయవాడ నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోకి రావాల్సిన వాహనాల పరిస్థితి ఇదే. నెల్లూరు నుంచి వచ్చే వాహనదారులు తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం రైస్‌మిల్లు వద్ద జాతీయ రహదారి నుంచి సర్వీసురోడ్డు మీదుగా పట్టణంలోకి ప్రవేశించాల్సి ఉంది. ఇక్కడా సూచిక బోర్డులు లేకపోవడంతో బసవయ్యపాళెం వద్ద వాహనాలు సర్వీసురోడ్డుకు మలుపు తిరగకుండా నేరుగా ఫ్లైఓవర్ మీద ప్రయాణం సాగిస్తున్నాయి. అక్కడి నుంచి జ్ఞానమ్మకండ్రిగ, శ్రీకాళహస్తి పట్టణ శివారు వీఎంపల్లి, జైహింద్ పురం, కాగితాల అరుంధతివాడ మీదుగా లంకమిట్ట, స్వర్ణముఖి నది వంతెన వరకు కొనసాగుతోంది. దాంతో బసవయ్యపాళెం వద్ద ముందుకు సాగిన వాహనాలు కొన్ని కిలోమీటర్లు తప్పనిసరి పరిస్థితుల్లో ముందుకు వెళ్లాల్సి వస్తోంది. ఆ తరువాత స్థానికులను అడిగి మళ్లీ పట్టణంలోకి రావాల్సి వస్తోంది. శ్రీకాళహస్తి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కొత్త రోడ్డు కావడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇక కొందరు గూగుల్‌మ్యాప్‌ను ఆశ్రయిస్తున్నప్పటికీ కొత్తరోడ్డుతో తీవ్ర గందరగోళానికి గురై గ్రామీణ ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పట్టణానికి ఇరువైపులా ప్రవేశమార్గాల వద్ద సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

పల్లె పండుగతో ప్రగతి పథం





పల్లం దళితవాడలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ - ఆదరంలో భూమి పూజ నిర్వహిస్తున్న శ్రీపతిబాబు తదితరులు

ఏర్పేడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలం ఈశాన్య భాగమైన పల్లం పంచాయతీ దళితవాడలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు, టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. పల్లం దళితవాడకు రూ.8లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించడానికి పల్లెపండుగ చేపట్టిందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొన్నారావు, నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, నాగేశ్వరరావు, రాజకుమార్‌నాయుడు, పల్లం రాజా, ఎంపీడీవో సౌభాగ్యం, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే లక్ష్యం...

కేవీబీపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లే అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో పల్లెపండుగ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని కాళంగి, ఆదరం, కండ్లూరు, బ్రాహ్మణపల్లి పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాల్ని ప్రారంభించారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీపతిబాబు హాజరయ్యారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణాభివృద్ధి అటకెక్కిందన్నారు. అనంతరం కాళంగి రిజర్వాయర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు థామస్, బీజేపీ మండల అధ్యక్షుడు మునిశేఖర్, పావని, రాజారెడ్డి, ఎంపీడీవో రాధారాణి, ఏపీవో కుమారస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇకపై జోరుగా పనులు

పిచ్చాటూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవికండ్రిగలో పల్లె పండుగ కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు ప్రారంభించారు. మండలంలో 34 పనులకు గాను రూ. 2కోట్లతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో తట్ట మట్టి రోడ్డుపైన పోసిన పాపాన పోలేదని నాయకులన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో సిమెంటు, తారు రోడ్లు, మురుగునీటి కాలువలు, గోకులం షెడ్లు, పొలాల్లో నీటి నిల్వ కుంటలు నిర్మాణ పనులు చేపడుతున్నారని వివరించారు.

పల్లెల్లో అభివృద్ధి పరుగులు

సత్యవేడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పల్లెలు ఇక అభివృద్ధి పథంలోకి దూసుకుపోతాయని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సుందరరామి రెడ్డి అన్నారు. మండలంలోని దాసుకుప్పంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీలకు నిధులు కేటాయించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు కూడా జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పరిపాలన సాగుతుండడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోకయ్యరెడ్డి, మాతయ్య, జగన్నాథం, పంచాయతీ సెక్రటరీ రమణమూర్తి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హేమమాలిని , ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





అడవికండ్రిగలో టీడీపీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో భూమిపూజ - దాసుకుప్పంలో సిమెంటు రోడ్డుకు భూమిపూజ

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

సత్యవేడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ వెల్లడించిన తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రానున్న మూడు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ నోడల్ అధికారి, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తుఫాన్ ప్రభావంపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. తుఫాను ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, విద్యుత్ తదితర శాఖల అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని తెలిపారు. తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్‌ఐ రామస్వామి, ఎంఈవో రవి, ఏపీవో క్రిష్ణయ్య, సెక్రటరీ మునిరవికుమార్, వీఆర్వోలు, సెక్రటరీలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాను పట్ల అధికారులు అప్రమత్తం గా ఉండాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులు పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతవరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలోఎటువంట ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు. సంబంధిత అధికారి గ్రామస్తులకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. మట్టి మిద్దెల్లో, పూరిళ్లలో ఉన్న వారిని ముందస్తుగా పాఠశాలలు, పంచాయతీ భవనాల్లోకి తరలించాలన్నారు. ప్రతి గ్రామంలో వైద్య శాఖ ద్వారా మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఉబ్బమలమడుగు జలశయంలోకి ఎవ్వరినీ అనుమతించవద్దన్నారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మునిరాజా, డాక్టర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: రానున్న తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకుని మండల అధికారులందరూ అప్రత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి తహసీల్దారు మునిరత్నంరెడ్డి ఆదేశించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన పూడి గ్రామాల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. కాళంగి యేరును దృష్టిలో ఉంచుకుని పూడి గ్రామాల్లో ప్రత్యేక వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళితులు

బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాము సాగు చేస్తున్న భూములకు పట్టాలి వ్వాలని మండలంలోని కుక్కంబాకం దళితులు సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు. సర్వే నెం.81లో 15ఎకరాలను గత పది సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. భూములను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.

పుత్తూరు వార్తలు

పల్లెల ప్రగతే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే భాను

పుత్తూరు టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పల్లెల ప్రగతే కూటమి ప్రభుత్వ ధ్యేమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. తిరుమలకుప్పంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా దళితవాడలో రూ.12.60లతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. గత ప్రభుత్వం పంచాయతీలను నీర్వర్యం చేసి, సర్పంచులను పట్టించుకోలేదన్నారు. జగన్ పాలనలో తట్ట మట్టి కూడా వేయకుండా, పంచాయతీ నిధులను దారి మళ్లించిందన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, సర్పంచ్ సరసమ్మ, ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పనులకు భూమి పూజ



అప్పలాయగుంటలో సైడ్ డ్రైన్ భూమి పూజ చేస్తున్న ఎంపీడీవో

వడమాలపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టికండ్రిగ, అప్పలాయగుంటల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రూ.61 లక్షలతో సిమెంట్ రోడ్డు, కాలువల నిర్మాణాలను చేపట్టారు. సర్పంచు వెంకటేష్, ఎంపీడీవో శేషగిరిరావు, ఉపాధి ఏపీవో సుజాత, ఈవోపీయార్డీ దయాకర్, నీటి పారుదల శాఖ ఏఈ రామ్మోహన్, పీఆర్ ఏఈ నాగేంద్ర, టీడీపీ నాయకులు, రఘు, వివేకానంద, శివశంకర్ వర్మ, పొన్నాయ్ రాజు, మోహన్, ఈశ్వరయ్య తదతరులు పాల్గొన్నారు.

గంగమ్మ కలశం ఊరేగింపు

వడమాలపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తిపుత్తూరులో సోమవారం గంగమ్మ కలశం ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో గంగ రాళ్ల ప్రతిష్ఠ నేపథ్యంలో ఇంటింటా పసుపు నీళ్లు కలశంలో పోస్తూ మహిళలు ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం గంగమ్మ రాళ్ల ప్రతిష్ఠ హోమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఈ గుంత కనబడలేదా?

పంగూరు వద్ద గుంతతో రోజు ప్రమాదాలే



గోతిలో దిగబడిన లారీ

ఏర్పేడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్యాస్ పైప్‌లైన్ కోసం తీసిన గొయ్యి పూడ్చక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. మండలంలోని పంగూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా శ్రీకాళహస్తి రహదారి పక్కన గ్యాస్ పైప్‌లైన్ కోసం మూడు నెలల క్రితం పెద్దగుంతను తవ్వారు. అయితే సంబంధిత కాంట్రాక్టరు నేటికి పూడ్చలేదు. దీంతో ప్రతినిత్యం ఆ మార్గంలో రాత్రి వేళలో ప్రయాణికులు, వాహనచోదకులు గుంతలో పడి ప్రమాదానికి గురవుతున్నారు. ఈ మూడు నెలల్లో సుమారు నాలుగు ప్రమాదాలు జరిగాయి. సోమవారం పడిన వర్షానికి ఆ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు ఆ గుంత వద్ద ఇబ్బందులు పడ్డారు. పంగూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య ను పరిష్కరించాల్సి ఉంది.

స్టార్టర్ల దొంగ అనుకుని...

ఏర్పేడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేర్లపాక సమీప గ్రామాల్లో కొద్దిరోజులుగా మోటర్ల చోరీ జరుగుతోంది. దీంతో భయాందోళనకు గురైన మేర్లపాక గ్రామస్తులు ఆదివారం రాత్రి గ్రామశివార్లలో తిరుగుతున్న ఓ యువకుడిని పట్టుకుని స్తంభానికి కటేసి సోమవారం ఉదయం పోలీసులకు అప్పగించారు. అయితే ఆ వ్యక్తిని ఏర్పేడు సీఐ విచారించగా తిరుపతి తాతయ్యగుంటకు చెందిన చిరంజీవిగా గుర్తించారు. చల్లపాళెంలో జరుతున్న జాతరకు వెళుతుండగా ద్విచక్రవాహనంలో పెట్రోల్ అయిపోయి మేర్లపాక వద్ద ఆగిపోయిందన్నాడు. అయితే గ్రామస్తులు అనుమానంతో యువకుడిని పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. తిరిగి అతనిని వదలిపెట్టారు.

మోస్తరు వర్షం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. మండలంలో 59.8మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువుల్లోకి నీరు చేరుతోంది. తహసీల్దార్ సుబ్రమణ్యం లక్ష్మీపురం గిరిజన కాలనీని పరిశీలించారు. ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది పలు గిరిజన కాలనీలను పరిశీలించారు.

విద్యుత్ డీఈఈ బాధ్యతల స్వీకరణ

రేణిగుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలం విద్యుత్‌శాఖ డీఈఈగా అంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిత్తూరు ప్రొటెక్షన్ విభాగానికి బదిలీ కాగా సోమవారం డీఈఈ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

కంటి వైద్య ఉచిత శిబిరం

ఏర్పేడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందాడు పంచాయతీలో అమెరికన్ లేయర్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సదాశివపురం, శివగిరి కాలనీ, కందాడు, సరస్వతికండ్రిగ, ముసలిపేడు, బత్తినయ్యకాలనీల ప్రజలు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ కేశవ ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు రాజేష్, ప్రియ పాల్గొన్నారు. 40మంది వైద్య పరీక్షలు చేయించుకోగా 12మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ నాల్గో సెమిస్టర్ ఫలితాల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందని ఆక్స్‌ఫర్డ్ కళాశాల విద్యార్థులు పట్టణ, యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బీఎస్‌సీ(ఎంఎస్‌సీఎస్)లో సింధు 9.43, పూజిత 8.20, జ్యోతిష్ 8.13, బీఎస్సీ(ఎంపీసీఎస్)లో నాగలక్ష్మి 8.09, సాయిశిరీష 7.59, సుప్రియ 7.25, బీఎస్సీ(బయోటెక్నాలజీ)లో యోగేశ్వరి 8.81, ప్రేమ్‌కుమార్ 8.13, కల్పన 7.43 పాయింట్లు సాధించారన్నారు. అలాగే బీకాం(సీ.ఏ)లో కె.హిమ 8.97, ఎస్‌కే మోహసినా 8.91, లలితకుమారి 8.84 పాయింట్లు సాధించారన్నారు.